క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



దేవరుప్పుల: మండలంలోని కడవెండిలో ఈనెల 3, 4వ తేదీన తలపెట్టిన కాటమ రాజు– గంగా దేవి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆహ్వానం పలికారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే స్థానిక ఎస్సై ఊర సృజన్‌కుమార్‌కు ఆహ్వానం పలికారు. పెద్దగొల్ల సుడిగెల కొమురయ్య, సారిగొల్ల తోటకూరి మల్లయ్య, కుల అధ్యక్షుడు మరసాని శ్రీనివాస్, కాడబోయిన శ్రీనివాసు, మద్దెబోయిన మహేష్, సుడిగెల కొమురయ్య, అంజయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

కంచనపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా జయరాములు



రఘునాథపల్లి: కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్‌చార్జ్ చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన అయిత జయరాములు శుక్రవారం ఎన్నికయ్యారు. ఇటీవల చైర్మన్ చీమలపాటి రవీందర్ మార్చి 17వ తేదీన ఆకాల మరణం చెందారు. ఖాళీ అయిన చైర్మన్ స్థానాన్ని భర్తీ చేసేందుకు డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దివ్య ఆధ్వర్యంలో సొసైటీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. మొత్తం 12 మంది డైరెక్టర్లు ఉండగా కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులైన ఆరుగురు అదే పార్టీకి చెందిన జయరాములుకు మద్దతుగా నిలిచారు. బీఆర్ఎస్ మద్దతు దారులైన ఐదుగురు డైరెక్టర్లు ఎన్నికకు గైర్హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు డైరెక్టర్లు జయరాములును ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కంచనపల్లి గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ప్రశాంత్, డైరెక్టర్లు మూడ్ ధర్మ, కావటి భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జలాభిషేకం



కొడకండ్ల: మండలకేంద్రంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో కంఠమహేశ్వర స్వామి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 15 ఏళ్ల తర్వాత ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గౌడ కుటుంబాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఇంటికో జల బిందె చొప్పున ఊరేగింపుగా ఆలయానికి గౌడ కులస్తులంతా చేరుకుని ఆచార సాంప్రదాయాలకనుగుణంగా పూజలు నిర్వహించి కంఠమహేశ్వరునికి జలాభిషేకం నిర్వహించారు.

'అభివృద్ధిని జీర్ణించుకోలేక ఆరోపణలు'



రఘునాథపల్లి: నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ.800 కోట్లు మంజూరు చేయిస్తే జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే రాజయ్య దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కంచనపల్లిలో వారు పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మొదట పార్టీ మారిన చరిత్ర రాజయ్యది అని, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శించే అర్హత ఆయనకు లేదని అన్నారు. నీతో బహిరంగ చర్చకు ఎమ్మెల్యే శ్రీహరి అవసరం లేదు, ఏ గ్రామంలో చర్చ పెడుతావో చెప్పు మేం వస్తామని వారు సవాల్ విసిరారు. పీఏసీఎస్ చైర్మన్ అయిత జయరాములు, మాజీ జెడ్పీటీసీ బొల్లం అజయ్, కోళ్ల రవిగౌడ్, కావటి భాస్కర్‌యాదవ్, రాపోలు రామ్మూర్తి, నామాల బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

తరిగొప్పుల/జనగామ రూరల్: మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన చేపట్టేందుకు నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని అన్నారు. ఎడెల్లి రాంనర్సింహారెడ్డి, పబ్బోజు రాంబ్రహ్మాచారి, కొన్నె రాజు పాల్గొన్నారు. అలాగే జనగామ మండలంలోని శామీర్‌పేటలో మండల అధ్యక్షుడు లద్దునూరి మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మర్క ఉపేందర్ మహేందర్, మలోత్ రాజు, కర్రే శ్రవణ్ కుమార్ సుంకరి కొమురయ్య, పత్తి చంద్రమౌళి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల తిష్ట

- పేరుకే మోడల్ రైల్వేస్టేషన్
- పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌కు ప్రజల డిమాండ్
- వందేళ్ల క్రితమే ఘన్‌పూర్‌లో స్టేషన్



స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి జంటపట్టణాలకు కలిపేలా ఉన్న స్థానిక రైల్వేస్టేషన్‌లో ఏళ్ల తరబడి పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. దాదాపు 127 ఏళ్ల క్రితం అప్పటి నిజాం ప్రభుత్వంలో ఎన్ఎస్ఆర్(నిజాం స్టేట్ రైల్వే) పేరిట ఇక్కడ రైల్వేస్టేషన్ ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఘనమైన చరిత్ర ఉన్న స్థానిక రైల్వేస్టేషన్‌లో సమస్యలు కూడా మేజర్‌గానే ఉన్నాయి. గతంలోనే స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా గుర్తించినా సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉన్నాయి. స్థానిక వ్యాపారులు, ప్రజలు పలుమార్లు సమస్యలను ఎస్‌సీఆర్ జీఎంతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ దక్కేనా..

స్థానిక రైల్వేస్టేషన్‌లో పుష్‌పుల్, కాకతీయ ప్యాసింజర్ రైళ్లు, భాగ్యనగర్, గోల్కొండ, ఇంటర్‌సిటీ, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఉంది. అయితే ఇక్కడ ఆలేరు, జనగామ స్టేషన్‌లతో పోలిస్తే ఆదాయం మెరుగ్గా ఉంటుంది. అయినప్పటికీ ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణికులకు సికింద్రాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా రైళ్ల సౌకర్యం లేక సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో లారీలు తదితర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ పద్మావతి, గౌతమి, మచిలీపట్నం, హౌరా, శాతవాహన, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ప్రజల నుంచి తీవ్రంగా డిమాండ్ ఉంది. అదేవిధంగా క్యాంటిన్, టాయిలెట్ల సౌకర్యం సరిగ్గా లేదు. రెండు ప్లాట్‌ఫారాల్లో షెడ్‌లు పూర్తిస్థాయిలో లేక వర్షాకాలం, వేసవికాలంలో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక అవస్థలు

ఘన్‌పూర్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి సౌకర్యం ఉండటంతో దాదాపు మూడేళ్ల క్రితం రైల్వే గేటును పూర్తిగా మూసివేసి గేట్‌మన్‌ను తొలగించారు. అప్పటి నుంచి పాదచారులు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లాలంటే దూరం అవుతుందని గేటు ప్రాంతం నుంచే రైలు పట్టాలు దాటుతున్నారు. దాంతో పలువురు రైలు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో కాలినడపక వెళ్లే వారికి అనువుగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నా అధికారుల నుంచి స్పందన లేదు. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యల్ని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



స్థానిక రైల్వేస్టేషన్‌లో సమస్యలు అధికంగా ఉన్నాయి. 127 ఏళ్ల చరిత్ర ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ పేరుకే మోడల్ రైల్వేస్టేషన్‌గా ఉంది. అధికారులు స్పందించి ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న పద్మావతి, దక్షిణ్, శాతవాహన తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్ళకు హాల్టింగ్ కల్పించాలి.

– బూర్ల విష్ణు

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి



ఘన్‌పూర్‌లో టికెట్ కౌంటర్ ద్వారా రైల్వేకు మంచి రెవెన్యూ ఉంటుంది. ప్రయాణికుల కోరిక మేరకు ఘన్‌పూర్‌లో శాతవాహన, దక్షిణ్, గౌతమి తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పిస్తే అన్ని వర్గాల ప్రజలకు అనువుగా ఉంటుంది.

తెల్లాకుల రామకృష్ణ

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



ఘన్‌పూర్‌లో రైల్వే గేటు ప్రాంతంలో గేటును పూర్తిగా మూసివేశారే గాని ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించలేదు. దాంతో ప్రమాదమని తెలిసినా పలువురు పాదచారులు గేటు మార్గం గుండా వెళ్తుండగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి గేటు మార్గంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి.

– పాలకుర్తి సోమశేఖర్

విద్యుత్ ఉద్యోగులకు శ్రమ శక్తి అవార్డులు



అవార్డులు అందుకుంటున్న విద్యుత్ ఉద్యోగులు

స్టేషన్‌ఘన్‌పూర్: మేడే సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ 327 విద్యుత్ ఉద్యోగులు సంవత్సర కాలంపాటు కనబర్చిన ప్రతిభ, నైపుణ్యతను గుర్తించి అందించిన శ్రమశక్తి అవార్డుల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన పలువురు విద్యుత్ ఉద్యోగులు అవార్డులు అందుకున్నారు. ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు ఒడ్డెపల్లి యాదగిరి, కార్యదర్శి బోసాని రాజ్‌కుమార్, వాసం శ్రీధర్‌పటేల్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ.ఫయాజ్, కోశాధికారి గబ్బెట సుధాకర్, సీనియర్ నాయకులు, లైన్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ అవార్డులు అందుకున్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు హన్మంతరావు, రాష్ట్ర లేబర్ సెల్ అధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్ చేతులమీదుగా వారు అవార్డులను అందుకున్నారు. 327 యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, వైస్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

జగద్గురువుల చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి



జనగామ రూరల్: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



పహల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న భక్తులు

జనగామ రూరల్: సనాతన ధర్మానికి ఆరాధ్యులైన జగద్గురు ఆదిశంకరాచార్యులు, భగవత్ రామానుజాచార్యుల చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని ప్రముఖ ఆధ్యాత్మిక తత్వవేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ అన్నారు. శుక్రవారం అద్వైత సిద్ధాంతకర్త జగద్గురు ఆదిశంకరాచార్యులు, విశిష్టాద్వైత సిద్ధాంతకర్త భగవత్ రామానుజాచార్యుల జయంతి వేడుకలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సీతారామచంద్రస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక కార్యకర్త పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామానుజాచార్యుల జయంతి

జనగామ: జిల్లా కేంద్రంలోని గణేష్ వాడ బొర్ర వెంకయ్యా ఆలయంలో శుక్రవారం శ్రీ రామానుజాచార్యులు, జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. విష్ణు సహస్ర నామ, సౌందర్యలహరి పారాయణం పఠించారు.

పహల్గాం మృతులకు నివాళి

కశ్మీర్ పహల్గాంలో తీవ్ర వాదుల చేతిలో హత్యకు గురైన హిందువులపై దాడిని ఖండిస్తూ భక్తులు శివ, విష్ణు సాహిత్యం పటిస్తూ, ఆత్మకు శాంతి కలగాలని మోక్ష దీపం వెలిగించి నివాళులర్పించారు. ఆలయ ప్రధాన పూజారి చిదంబర శాస్త్రీ, మహిళా భక్తులు పజ్జూరి శారద, కల్పన, మాధవి, వర లక్ష్మి, రాధిర, నాగజ్యోతి జనగామ భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

బచ్చన్నపేట: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకుడు పాటు పడాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ నాయకత్వంలో కులగణనకు కేంద్ర క్యాబినేట్ ఆమోదం తెలుపడంతో అన్ని రాష్ట్రాల్లో సర్వే ప్రారంభం కానుందన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి సంతోష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహిపాల్, కూరెళ్ల వెంకట్‌రెడ్డి, దేవరాయ ఎల్లయ్య, శశిధర్‌రెడ్డి, రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు మహేష్, రవి పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ కృషి ఫలితమే కులగణన



రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

తరిగొప్పుల: రాహుల్ గాంధీ ఆలోచన విధానంతోనే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొట్టమొదటి సారిగా కులగణన చేపట్టిందని, రాహుల్ కృషివలనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి కులగణన చేపట్టనుందని మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి అన్నారు. దేశం అంతటా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున మండలకేంద్రంలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ శ్రేణులు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య, గోరంతల వీరన్న, ఎర్రవెల్లి పోషయ్య, జయరాజ్, అరుణ్‌రెడ్డి, సాయిరెడ్డి, లూకా, థామస్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

జఫర్‌గఢ్: కూనూర్ గ్రామంలో యాదవ, కురుమ సంఘాల ఆధ్వర్యంలో కొమురవెల్లిమల్లికార్జున స్వామి, బీరప్ప ఆలయాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బెల్లి రాజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదనాల సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా బుల్లె లింగయ్య, కార్యదర్శి ఎక్కళ్ల సురేష్, సహాయ కార్యదర్శులుగా ముక్కెర ఆశోక్, యాదనాల రాజు, నల్లబెట్ల సంతోష్, కమిటీ సభ్యులుగా బుల్లె సోమయ్య, యాదనాల కొమురెల్లి, ముక్కెర రమేష్, నల్లబెట్ల చిన్న రాజు, బుల్లె రాజయ్య, బైకాని సారయ్య, బెల్లి పెద్దన్న, సకినాల పరుశరాములు, ఎక్కళ్ల మల్లేష్, బైకాని సంపత్, నాయిని విష్ణు స్వామి, బెల్లి ఆజయ్, కొండబోయిన శ్రీకాంత్, బుల్లె జయశంకర్‌తో పాటు తదితరులు ఎన్నికైన వారిలో ఉన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోవాలి



సాఫ్ట్‌బాల్ శిబిరంలో మాట్లాడుతున్న కోచ్ సందీప్

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఫాదర్ కొలంబో స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ థామస్‌కిరణ్ అన్నారు. స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల, ఫాదర్ కొలంబో స్కూల్ మైదానంలో పీడీ, ఫుట్‌బాల్ కోచ్ సింగపురం మహేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. కోచ్ సింగపురం మహేష్, పీఈటీ టి.రమేష్, ప్రణయ్, చైతన్య, నితేజ్, రిషి, నిఖిల్, అభినవ్, శ్రీకాంత్, వరుణ్, సాయి, హర్ష, ఆర్యన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లుట్లలో ఉచిత తైక్వాండో శిక్షణ

లింగాలఘణపురం: నెల్లుట్లలో జేఎంబీసీ చర్చి ప్రాంగణంలో శుక్రవారం ఉచిత తైకాండో శిక్షణ శిబిరాన్ని స్థానిక సంఘ పాస్టర్ ఇమ్మానియేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు శారీరక , మానసిక దృఢత్వాన్ని పొందాలని, శిక్షణలో మాస్టర్‌గా వరల్డ్ రికార్డు హోల్డర్ మాస్టర్ ఎం.డీ అబ్బాస్ ఉంటారని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాహుల్, నియోజకవర్గ యూత్ కార్యదర్శి ప్రవీణ్ ఉన్నారు.

సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం

పాలకుర్తి: సాఫ్ట్‌బాల్ వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాకారుల డివైఎస్‌ఓ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని జెడ్పీ పాఠశాలలో కోచ్ బాలబోయిన సందీప్ ప్రారంభించి మాట్లాడారు.. హెచ్ఎం పుస్కూరి రమేష్, ఎస్ఎంసీ చైర్మన్ అబ్బాస్, మాజీ సర్పంచ్ కారుపోతుల వెంకటయ్య, వీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యాకయ్య, గణేష్, హరీష్, తండ వినయ్, రాము పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు సన్మానం



జఫర్‌గఢ్: సన్మానం పొందిన టెన్త్ టాపర్లతో ప్రిన్సిపాల్, టీచర్లు



జనగామ రూరల్: విద్యార్థులతో ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి టాపర్లుగా నిలిచిన కస్తూర్బా విద్యాలయానికి చెందిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సిహెచ్ స్వప్న, ఉపాధ్యాయినులు పాఠశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. టెన్త్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.వైష్ణవి 560 మార్కులు సాధించగా సీహెచ్ అంజలి 559, జే.స్వాతిక 549, పి.అర్చన 549 మార్కులు సాధించారు. కాగా, వారితోపాటు తల్లిదండ్రులను శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతున్నదన్నారు. కాగా, ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల విద్యార్థులకు డీఈఓతో పాటు జీసీడీఓ గౌసియాబేగం, ఎంఈఓ రఘునందన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో..

చిల్పూరు: మల్కాపూర్ గ్రామంలోని జ్యోతినికేతన్ పాఠశాల 10వ తరగతి మండల టాపర్లను పాఠశాల యాజమాన్యం అభినందించారు. పాఠశాలకు చెందిన జంపన లిఖిత 569, రమాదేవి 563 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

జనగామ రూరల్: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వడ్లకొండ ఉన్నత పాఠశాల హెచ్ఎం స్వర్గం ప్రకాశం అన్నారు. శుక్రవారం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించి సన్మానించారు. ముస్త్యాల వినేష్ తండ్రి చిన్ననాడే మృతి చెందినప్పటికీ పట్టుదలతో చదివి 551 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. అలాగే గౌరగల్ల ప్రీతి 538 మార్కులు, 32 మంది విద్యార్థులు 500 మార్కుల పైగా సాధించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

మండల టాపర్లకు అవార్డులతో సత్కారం

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ కిరణ్మయి, ఎ.మానసలు పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో మండల టాపర్లుగా నిలవగా..యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొనాసి క్రాంతికుమార్ శుక్రవారం గ్రామంలో వారిని మహిళా శక్తి అవార్డులతో సత్కరించారు.

ప్రమాదవశాత్తు గడ్డి దగ్ధం

కొడకండ్ల: గడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి షాట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెంది గడ్డి మొత్తం కాలిపోయిన సంఘటన శుక్రవారం మండలకేంద్రంలో చోటు చేసుకొంది. స్థానికుల కథనం ప్రకారం.. కొడకండ్లకు చెందిన బొల్లి శ్యామ్ పొలం వద్ద గడ్డి మోపులు కట్టించుకొని ట్రాక్టర్‌లో ఇంటికి తీసుకెళ్తుండగా అమరవీరుల స్తూపం వద్దకు రాగానే ట్రాక్టర్ డ్రైవర్ గమనించకపోవడంతో విద్యుత్ తీగలకు గడ్డి మోపులు తాకడంతో షాట్‌సర్క్యూట్‌కు గురై మంటలు వ్యాపించాయి. చౌరస్తాలో ఉన్న స్థానికులు గమనించి గడ్డి మోపులను కింద వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తహసీల్దార్ చంద్రమోహన్ వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను ఆర్పి వేసినప్పటికి గడ్డి మొత్తం కాలిపోయింది. స్థానికులు సమయస్ఫూర్తితో వ్యవహరించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిపోయింది. ఈ సంఘటనతో గడ్డి మొత్తం కాలిపోయి రూ.20 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

చిల్పూరు: ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన లింగంపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో గ్రామానికి చెందిన కొత్తూరి చంద్రమౌళికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై నవీన్‌కుమార్ అక్కడకు చేరుకుని గాయపడ్డ క్షతగాత్రుడిని 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

వేంకటేశ్వరుడికి తులసీ దళాలతో అలంకరణ



చిల్పూరు: బుగులు శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్ర(లక్ష్మి)వారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు తులసీ దళాలతో అలంకరించారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు పర్యవేక్షించారు.

వైభవంగా ఆరుద్రోత్సవం



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి అర్చకులు పంచ హారతులు, గర్భాలయంలో దీపోత్సవం నిర్వహించారు. ఈ ఆరుద్రోత్సవం కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్‌శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, నాగరాజు, సూపరింటెండెంట్ వెంకటయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

జనగామ రూరల్: అడవికేశవపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బాదావత్ మోహన్ విద్యుత్ స్తంభంపై పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కాగా మోహన్‌ను వెంటనే ఘటకేసర్‌లోని నీలిమ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం మోహన్‌ను ఆస్పత్రిలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

బాధిత కుటుంబాలకు..

దేవరుప్పుల: కోలుకొండలో మృతి చెందిన జడల భిక్షపతి, మాచర్ల ప్రవీణ్, నాయిని ఐలమ్మ కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రతి సభ్యుడికి ఆరోగ్య తదితర బీమాలు ఉండేలా పార్టీ సీనియర్లు పాటుపడాలని సూచించారు.

కొడకండ్లలో..

కొడకండ్ల: మండలంలోని బాధిత కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మండలకేంద్రానికి చెందిన ఉద్యమకారుడు మహ్మద్ షన్నాకు కాలుకు ఫ్రాక్చర్ అయి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి రాగా దయాకర్‌రావు పరామర్శించారు. అలాగే పులుగుజ్జ రాములు, లక్ష్మక్కపల్లిలో కాటూరి యాదగిరి స్వామిలు మృతి చెందగా వారి కుటుంబాలను ఎర్రబెల్లి పరామర్శించారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ నాయుడు, మాజీ ఉపసర్పంచ్ కాటబత్తిని రమేష్ అత్త కామారపు ఉపేంద్ర అనారోగయతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులు దయాకర్‌రావు పరామర్శించారు. అదే విధంగా మండలంలోని అయ్యంగారిపల్లి బీఆర్ఎస్ నాయకుడు ముస్కు సిద్దులు తల్లి ముస్కు శేషమ్మ మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బచ్చన్నపేట: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయం ప్రిన్సిపాల్ భారతి దేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాలలో అన్ని రకాల కోర్సులు ఉన్నాయని ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వర కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని 22వ తేదీన దరఖా స్తు ఫారాలను కళాశాలలో అందించాలని తెలి పారు. విద్యార్థుల పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని అన్నారు.

ఆర్యవైశ్య మహాసభ మండల యూత్ అధ్యక్షుడిగా శివ

పాలకుర్తి టౌన్: ఆర్యవైశ్య మహాసభ పాలకుర్తి మండల యూత్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన చారగొండ్ల శివ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం యూత్ జిల్లా అధ్యక్షుడు గజ్జి సంతోష్ ప్రకటించారు. శివ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రానికి చెందిన కాంగ్రెస్ మండల నాయకుడు తాటికొండ బండల రాజయ్య(55) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందారు. రాజయ్య వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం పనిపై బయటికి వెళ్లి వచ్చిన రాజయ్యకు ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇంటిపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని ఇంటి యజమాని జీడి శ్రావణ్ శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గాలి దుమారానికి ఇంటి సమీపంలోని విద్యుత్ స్తంభం ఒరిగిందని, మరోసారి గాలి వీస్తే ఎక్కడ ఇంటిపై పడుతుందోనని భయాందోళనకు గురవతున్నామన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

నియామకం

చిల్పూరు: చిన్నపెండ్యాల గ్రామ సమీపంలోని మల్లంకుంట్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్‌గా గ్రామానికి చెందిన రామడుగు బుచ్చికొంరయ్య నియమితులయ్యారు. శుక్రవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా నియామక పత్రాన్ని బుచ్చికొమురయ్య అందుకున్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: బండనాగారం గ్రామంలో మానెపల్లి భిక్షపతి మృతి చెందాడు. కాగా, శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను కొడవటూర్ దేవస్థాన మాజీ చైర్మన్ చల్ల సురేందర్‌రెడ్డి పరామర్శించి రూ. 5వేల సాయం అందజేశారు. ఇజ్జగిరి రాములు, చల్ల రమేష్‌రెడ్డి, కామిడి రవీందర్‌రెడ్డి, జంగిలి స్వామి, ఇప్ప శ్రీధర్‌రెడ్డి, నరేష్, రాజలింగం, యాదయ్య, లక్ష్మారెడ్డి, మల్లయ్య, కనుకయ్య ఉన్నారు.

పోరాటాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ

జఫర్‌గఢ్: మంద కృష్ణ మాదిగ పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ సందేన రవీందర్ మాదిగ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు గాదెపాక మహేందర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రడపాక ఆదాం, ఇల్లందుల రాంబాబు, ఇల్లందుల యాకనాథం, సంపత్, గంగాధర్, రవీందర్, హరికృష్ణ, మచ్చరాజు పాల్గొన్నారు.

అసువులు బాసినా మరువని స్నేహితులు

దేవరుప్పుల: తోటి స్నేహితుడు అకాల మరణం పొందినా వీడని స్నేహబంధంతో ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. శుక్రవారం సీతారాంపురం అనాథ శరణాలంలో వృద్ధుల మధ్య చింత శ్రీకాంత్ జన్మదిన కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.